

గట్టేపల్లి కొనుగోలు కేంద్రంలో వర్షం నీటిని బయటకు తోడుతున్న రైతు

# వడ్లన్నీ వర్షార్పణం

★కొంపముంచిన హమాలీల కొరత

★గట్టేపల్లి కొనుగోలు కేంద్రంలో అన్నదాతల అగచాట్లు

**ధారూర్, మే 21 ప్రభాతవార్త :** ధారూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం దంచికొట్టింది. మండల పరిధిలోని గట్టేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన వడ్లన్నీ తడిసి ముద్దయ్యాయి. నెలల తరబడి రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన పంట, చేతికొచ్చే టైంకి కళ్ల ముందే వర్షం పాలవడంతో అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు.

కొనుగోలు కేంద్రంలో హమాలీల కొరత దారుణంగా ఉండటం వల్లే తమకు ఈ గతి పట్టిందని రైతులు మండిపడుతున్నారు. ప్రస్తుతం రాంపూర్ తండా, గట్టేపల్లి రెండు సెంటర్లకు కలిపి సరిపోయేటంత మంది హమాలీలు లేకపోవడంతో కాంటా (తూకం) వేయడం పనుల్లో బాగా ఆలస్యమవుతోందని వాపోయారు. తగినంత మంది మనుషులు ఉండి ఉంటే.. టైంకి తూకం అయిపోయి తమ ధాన్యం సేఫ్‌గా గోదాములకు చేరేవని, ఇదంతా అధికారుల నిరక్ష ్యమేనని కన్నీరుమున్నీరయ్యారు.

**తడిసిన వడ్లను ప్రభుత్వమే కొనాలె!**

వాన పడుతుంటే వడ్లు తడవకుండా ఉండేందుకు రైతులు ప్లాస్టిక్ కవర్లు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేసినప్పటికీ.. కింద నుంచి వర్షపు నీరు చేరడంతో ధాన్యం కుప్పలన్నీ నీళ్లల్లో మునిగిపోయినాయి. నిలువునా నష్టపోయిన తమను ఆదుకునేందుకు పెద్ద సార్లు (ఉన్నతాధికారులు) తక్షణమే స్పందించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు. గట్టేపల్లి కేంద్రంలో హమాలీల సంఖ్యను వెంటనే పెంచి తూకం పనులను స్పీడ్ చేయాలని, అలాగే వర్షానికి తడిసిన వడ్లను ఎలాంటి అడ్డంకులు (ఆంక్షలు) పెట్టకుండా ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేసి తమ్మల్ని ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.




దౌల్తాబాద్ మండలంలో ధర్నా చేస్తున్న రైతులు

☛కొనేవాళ్లు లేక ధాన్యం మొలకెత్తుతోంది

☛అన్లోడ్ చేయడానికి అధికారులు నిరాకరిస్తున్నారు

☛ట్రాక్టర్లకు వెయిటింగ్ ఛార్జీలు కట్టలేకపోతున్నాం

☛దేవర్‌ఫస్లావాద్‌లో అన్నదాత కంటతడి

**దౌల్తాబాద్, మే 21, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని దేవర్‌ఫస్లావాద్ గ్రామంలో రైతులు రోడ్డెక్కారు. గత నెలరోజులుగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని తరలించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. రోజుల తరబడి ధాన్యం కేంద్రాల్లోనే మూలుగుతుండటంతో, వాతావరణ మార్పుల వల్ల వరి ధాన్యం మొత్తం మొలకెత్తిపోయిందని కన్నీరు పెట్టుకున్నారు. తమ ఆవేదనను వినేవారే కరువయ్యారని మండిపడిన రైతులు విసిగిపోయి చివరికి తమ సొంత ఖర్చులతో ట్రాక్టర్లలో ధాన్యాన్ని లోడ్ చేసుకుని వెళ్తే, అక్కడ కూడా అన్లోడ్ చేయడానికి అధికారులు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రతిరోజు ట్రాక్టర్లకు వేల రూపాయల వెయిటింగ్ ఛార్జీలు కట్టాల్సి వస్తోందని, తాము అప్పులపాలవుతున్నామని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని, అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దొంగల రాజ్యం-దోపిడి రాజ్యం అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే రైతులకు ఈ స్థాయి అన్యాయం జరగడంపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ధాన్యాన్ని అన్లోడ్ చేసుకోవాలని, నష్టపోయిన తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

సొంతింటి కల కనడం సామాన్యుడికి మరింత భారం కానుంది. ఒకవైపు పెరిగిన ఇండ్ల ధరలు, మరోవైపు నిర్మాణ సామాగ్రి ఖర్చులతో సతమతమవుతున్న మధ్యతరగతి ప్రజలపై రిజిస్ట్రేషన్ల ఛార్జీల పెంపు రూపంలో అదనపు భారం పడనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరులను పెంచుకునే క్రమంలో భాగంగా మార్కెట్ విలువల సవరణకు సిద్ధమవుతుండటంతో, రిజిస్ట్రేషన్ ఖర్చులు భారీగా పెరగనున్నాయి. ఇది సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టడమే కాకుండా, రియల్ ఎస్టేట్ రంగంపై కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు అనేది బ్లాక్ మనీని అరికట్టేందుకు, ప్రభుత్వ ఖజానా నింపేందుకు దోహదపడినప్పటికీ.. కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని ఇల్లు లేదా స్థలం కొనాలనుకునే మధ్యతరగతి వర్గాల పాలిట ఇది కచ్చితంగా అదనపు భారమే అని చెప్పక తప్పదు.

# సొంతింటి కలపై భారం

భూముల మార్కెట్ విలువ పెంపునకు రంగం సిద్ధం

ఐటీ కారిడార్ తదితర పారిశ్రామిక ప్రాంతాలలో రెట్టింపు అయ్యే అవకాశం

భారీగా పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీలు

రియల్ ఎస్టేట్ రంగంలో కలకలం

ముందే మేల్కొంటున్న పెట్టుబడిదారులు

ఛార్జీలు పెరగకముందే రిజిస్ట్రేషన్ల కోసం క్యూ

కొత్త నిబంధనలతో చెక్ పడనున్న బ్లాక్ మనీ లావాదేవీలు

**రంగారెడ్డి అర్బన్, మే21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువల సవరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు భారీగా పెరగనున్నాయి. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భూముల గైడ్‌లైన్ మార్కెట్ విలువలను 110 శాతం వరకు పెంచే అవకాశమున్నట్లు రెవెన్యూ శాఖ వర్గాల సమాచారం. ముఖ్యంగా హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న మండలాలు, ఐటీ కారిడార్ సమీప గ్రామాల్లో ఈ పెంపు అధికంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కొనుగోలు, అమ్మకాలు జరుగుతున్న ధరలు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ శాఖ అమలు చేస్తున్న గైడ్‌లైన్ విలువల మధ్య భారీ వ్యత్యాసం ఉందని అధికారులు గుర్తించారు. అనేక ప్రాంతాల్లో వాస్తవ మార్కెట్ ధరలు కోట్ల రూపాయలకు చేరుకున్నప్పటికీ, రిజిస్ట్రేషన్ విలువలు చాలా తక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం జరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే భూముల విలువలను ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా సవరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

**కొత్త టౌన్‌షిప్‌లతో అమాంతం రెక్కలు**

రంగారెడ్డి జిల్లా గత కొన్ని సంవత్సరాలుగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టులు, మెట్రో విస్తరణ ప్రతిపాదనలు, ఐటీ కంపెనీల విస్తరణ, పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, కొత్త టౌన్‌షిప్‌లు ఏర్పడటంతో భూముల ధరలు అమాంతం పెరిగాయి. ముఖ్యంగా శంషాబాద్ విమానాశ్రయం పరిసర ప్రాంతాలు ఆదిభట్ల, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, మొయినాబాద్, నార్సింగి వంటి ప్రాంతాల్లో ఎకరాల ధరలు భారీ స్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ప్రత్యేక సర్వే నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన భూముల కొనుగోలు, అమ్మకాల రిజిస్ట్రేషన్ వివరాలు మార్కెట్‌లో ఉన్న ప్రస్తుత ధరలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల సూచనలు, స్థానిక పరిస్థితులను ఆధారంగా తీసుకొని కొత్త మార్కెట్ విలువలను రూపొందిస్తున్నట్లు సమాచారం. గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాల వారీగా ప్రత్యేకంగా విలువలు నిర్ణయించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకించి ఐటీ కారిడార్‌కు సమీప ప్రాంతాల్లో భారీ పెంపు ఉండే అవకాశముందని రియల్ ఎస్టేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం లక్ష రూపాయలుగా ఉన్న చదరపు గజం రిజిస్ట్రేషన్ విలువలు కొన్ని ప్రాంతాల్లో రెండు లక్షల రూపాయలకు పైగా పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. వ్యవసాయ భూములు, ప్లాట్లు, కమర్షియల్ స్థలాలు, వెంచర్లు, హైవేలకు ఆనుకుని ఉన్న భూముల విలువలు మరింతగా పెరగనున్నాయని సమాచారం.



**మధ్యతరగతికి మంట**

మార్కెట్ విలువలు పెరిగితే స్టాంప్ డ్యూటీ రూపంలో వేలల్లో లేదా లక్షల్లో అదనంగా చెల్లించాల్సి వస్తుంది. దీనివల్ల ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు చేయాలనుకునే మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడే అవకాశం ఉంది. ఇప్పటికే బ్యాంకు వడ్డీలు, నిర్మాణ వ్యయాలు పెరిగిన నేపథ్యంలో ఇప్పుడు రిజిస్ట్రేషన్ ఖర్చులు కూడా పెరగడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

**ఖజానాకు కాసుల పంట**

అయితే మరోవైపు ప్రభుత్వానికి మాత్రం భారీగా ఆదాయం పెరగనుంది. రాష్ట్రంలో అత్యధిక రిజిస్ట్రేషన్లు జరిగే జిల్లాల్లో రంగారెడ్డి ఒకటి కావడంతో కొత్త మార్కెట్ విలువల అమలుతో ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల అదనపు ఆదాయం వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

# రూ. 10 వేల టికెట్.. ఏకంగా లక్ష!

ఉప్పల్‌లో ఐపిఎల్ క్రేజ్‌ను సొమ్ముచేసుకోవటానికి మాఫియా దందా

3 లక్షల మంది క్యూ..

జొమాటో డిస్ట్రిక్ట్ యాప్ సేల్స్ నిమిషాల్లోనే సోల్డ్ అవుట్!

అభిమానులను బురిడీ కొట్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలింపు?

వివరాలు దాస్తున్న సన్‌రైజర్స్ యాజమాన్యం

**ఉప్పల్, మే 21 ప్రభాతవార్త :** ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద బ్లాక్ టికెట్ల మాఫి యా రెచ్చిపోయింది. ఐపిఎల్ క్రేజ్‌ను ఆసరాగా చేసుకుని యథేచ్ఛగా బ్లాక్ టిక్కెట్ల దందా సాగించింది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం గేట్ నెం.2 వద్ద గురువారం కొందరు వ్యక్తులు టిక్కెట్లు విక్రయిస్తుండగా పోలీ సులు .రూ. 10 వేల టికెట్‌ను రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. స్టేడి యం గేట్ నంబర్2 వద్ద రహస్యంగా సాగుతున్న దందాను పట్టుకునేందుకు పోలీసులు మఫ్టీలో ఉన్నప్పటికి నిందితులు తప్పించుకున్నారు. మరి కొందరు పట్టుబడినట్లు సమాచారం. బెంగళూరు, హైదరాబాద్ మ్యాచ్ టికెట్ల అమ్మకాల వెనుక పెద్ద ఎత్తున దందా నడిచిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సీజన్‌లో నగరంలో ఇదే చివరి మ్యాచ్ కావడం, దానికి తోడు స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి బరిలోకి దిగుతుండటంతో అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఈ క్రేజ్‌ను సన్రైజర్స్ ఫ్రాంచైజీ క్యాష్ చేసుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా రూ. 950గా ఉండే కనీస టికెట్ ధరను ఏకంగా రూ. 1,950కి పెంచేయడమే కాకుండా, సౌత్ స్టాండ్ కార్పొరేట్ బాక్స్ టికెట్ ధరను రూ. 30 వేల నుండి ఒకేసారి రూ.45 వేలకు పెంచేశారు. దీనివల్ల సామాన్య క్రికెట్ ప్రేమికులకు మ్యాచ్ చూసే అవకాశం పూర్తిగా దూరమైంది. ఇంత భారీగా ధరలు పెంచినా సరే, మ్యాచ్ చూడాలను కున్న ప్రేక్షకులు ఆన్‌లైన్‌లో బుకింగ్స్ తీవ్ర నిరాశే ఎదురైంది. జొమాటో డిస్ట్రిక్ట్ యాప్‌లో జరిగిన ఆన్‌లైన్ టికెట్ సేల్స్ ప్రక్రియ ఇప్పుడు అనేక అనుమానాలకు దారి తీస్తోంది. గత శుక్రవారం సాయంత్రం ఆన్‌లైన్‌లో టికెట్ల అమ్మకాలు ప్రారం భించిన కేవలం నిమిషాల వ్యవధిలోనే సోల్డ్ అవుట్ బోర్డు ప్రత్యక్షం కావడంపై ఫ్యాన్స్ మం డిపడుతున్నారు.

ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం మొత్తం సామర్థం 39 వేల సీట్లు. ఇందులో విఐ పిలు, అధికారులకు ఇచ్చే ఉచిత కాంప్లిమెంటరీ పాసులు కాకుండా సుమారు 30 నుండి 32 వేల టికెట్లు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచాలి. కానీ, ఆన్‌లైన్ సేల్స్ ప్రారంభం కాగానే దాదాపు 3 లక్షల మందిని క్యూలో చూపించి, అసలు టికెట్లు బుక్ చేసుకునే లోపే వేలాది టికెట్లు కంటికి కనిపించకుండా మాయమైపోయాయి. ఈ టికెట్ల మాయం వెనుక తెరవెనుక పెద్ద దందా నడిచిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంటి తుడుపుగా ఆన్‌లైన్ బుకింగ్స్ ఓపెన్ చేసి, అభిమానులను బురిడీ కొట్టించి మెజారిటీ టికెట్లను బ్లాక్ మార్కెట్‌కు తంలించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్‌లో సాధారణ ప్రజలకు ఎన్ని టికెట్లు అందుబా టులో ఉంచారు, ఇప్పటివరకు ఎన్ని టికెట్లు అ మ్ముడయ్యాయి అనే పూర్తి వివరాలను సన్‌రైజర్స్ యాజమాన్యం బయటపెట్టకుండా దాచడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది.



ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు

# విజయమే లక్ష్యంగా..

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికకు ముస్తాబు

ప్రజాప్రతినిధుల సమక్షంలో నేడు జిల్లా స్థాయి వేడుక

లబ్ధిదారుల వివరాలతో సమగ్ర నివేదికలు..

శాఖల వారీగా ప్రత్యేక స్టాళ్లు!

సాధించిన పురోగతిపై డిజిటల్ ప్రదర్శన

ఏర్పాట్లలో యంత్రాంగం తలమునకలు

**రంగారెడ్డి అర్బన్, మే21, ప్రభాతవార్త:** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో మరో కీలక ఘట్టానికి వేదిక సిద్ధమవుతోంది. ఇప్పటికే గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు జిల్లా స్థాయిలో అంతే అట్టహాసంగా నిర్వహించేందుకు యంత్రాంగం నడుం బిగించింది. ఈ నెల 22న జరగబోయే ఈ జిల్లా స్థాయి వేడుకను ఒక పండుగలా, ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఘనంగా నిర్వహించడమే లక్ష ్యంగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

**అధికారులకు అదనపు కలెక్టర్ దిశానిర్దేశం**

ఈ భారీ కార్యక్రమ ఏర్పాట్లపై జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం ఆమె సంబంధిత శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష జరిపారు. క్షేత్రస్థాయిలో సాధించిన విజయాలను జిల్లా వేదికపై అద్దం పట్టేలా చూపించాలని ఆమె అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, గతంలో చూపిన స్ఫూర్తితోనే ఈ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక ద్వారా జిల్లాలో జరిగిన మార్పును కళ్ళకు కట్టేలా చూపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలతో సమగ్ర నివేదికలు సిద్ధం చేస్తున్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. జిల్లా సాధించిన పురోగతిని, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రతిబింబించేలా ఒక ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రదర్శించనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలను ప్రజలకు వివరించేలా ప్రత్యేక స్టాళ్లను కూడా ఏర్పాటు చేయబోతున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించి, వారి సమక్షంలో జిల్లా ప్రగతిని ఘనంగా చాటిచెప్పేందుకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.



**శాఖల సమన్వయమే సక్సెస్‌కు కారణం: కలెక్టర్ మనుచౌదరి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 21, ప్రభాతవార్త :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై ఈ నెల 22న ఉదయం 9.30గంటలకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా స్థాయి కార్యక్రమం జరుగుతుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఈ కార్యక్రమంకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు, జిల్లా కలెక్టర్ మనుచౌదరి(ఐఏఎస్), మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి(ఐఏఎస్), అదనపు కలెక్టర్లు, మున్సిపల్ జోనల్ కమిషనర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్, జిల్లా ఆర్‌టిఏ మెంబర్, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, 99రోజుల కార్యచరణ ప్రణాళికపై పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన, పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించటం, జిల్లా స్థాయి సమస్యలు, అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించటం, ఇప్పటి వరకు నిర్వహించిన థిమాటిక్ వారాల విజయాల ప్రదర్శన వంటి కార్యక్రమాలతో పాటు భవిషత్‌లో రానున్న పథకాల గురించి అవగాహన కల్పించటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిచంటంతో పాటు వివిధ శాఖల విజయాలను ప్రజల ముందుంచటం జరుగుతుందని, వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేయటం ప్రధాన లక్ష్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి కోరారు.

## పోలీసు ఉద్యోగాల పేరుతో సైబర్ వల!

**హైదరాబాద్, మే 21 ప్రభాతవార్త**

నిరుద్యోగులే లక్ష ్యంగా సైబర్ నేరగాళ్లు సో షల్ మీడియాలో వల విసురుతున్నారు. తాజా గా "హైదరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బంగారు ఉద్యోగ అవకాశాలు" అంటూ నెట్టింట విస్తృ తంగా చక్కర్లు కొడుతున్న ఓ ప్రకటన తీవ్ర కలకలం రేపింది. ఎలాంటి రాత పరీక్ష లేకుం డా కేవలం ఇంటర్వ్యూ ద్వారా క్లీనర్లు, ఆఫీస్ సహాయకుల పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ఆకట్టుకునేలా ఆ ప్రకటనను రూపొందించారు. నెలకు రూ.18,000 నుంచి రూ.56,900 వరకు జీతం ఉంటుందని ఊరిం చారు. అయితే, ఈ ప్రకటన పూర్తిగా అవాస్తవమని, దీనిపై ఎవరూ స్పందించవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పష్టం చేశారు.

**మోసపోకండి : సిపి**

ఈ మేరకు గురువారం ఎక్స్(ట్విట్టర్) వేదికగా సజ్జనార్ ఒక పోస్ట్ చేస్తూ నిరుద్యోగులను హెచ్చరించారు. వైరల్ అవుతున్న నకిలీ ప్రకటనపై ఫేక్ అని ముద్రించిన ఫోటోను ఆయన షేర్ చేశారు. 'హైదరాబాద్ పోలీసుల రిక్రూట్మెంట్ పేరుతో కొందరు మోసపూరిత ప్రకటనను ప్రచారం చేస్తున్నారు.

దయచేసి ధృవీకరించుకోకుండా ఇలాంటి పోస్టులను ఎవరూ నమ్మవద్దు, ఇతరులకు షేర్ చేయవద్దు. అధికారిక ప్రకటనలు మాత్రమే నమ్మాలి. హైదరాబాద్ పోలీసు శాఖకు సంబంధించిన ఎలాంటి రిక్రూట్మెంట్ నోటిఫికేషన్లు అయినా మా అధికారిక మార్గాల (వెబ్సైట్లు, పత్రికా ప్రకటనలు) ద్వారా మాత్రమే ప్రకటిస్తాం' అని సజ్జనార్ పేర్కొన్నారు.



బోరుబావి తవ్వకం పనులు ప్రారంభిస్తున్న ఎస్పీ

## పోలీసు శిక్షణ కేంద్రంలో మౌలిక వసతులకు చర్యలు

**వికారాబాద్, మే 21, ప్రభాతవార్త :** జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో గురువారం నూతన బోరుబావి తవ్వక పనులను ఎస్పీ స్నేహామెహ్రా ప్రారంభించారు. డీటీసీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఆమె తెలిపారు. బోరుబావి తవ్వకాలే కాకుండా ఇతరత్రా పనులు వేగమంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, డీసీఆర్బీ డీఎస్పీ జానయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



మృతుల కుటుంబాలకు సాయం అందిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

**మర్పల్లి, మే 21 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని కల్‌ఖోడా గ్రామంలో పదిమంది బాధిత కుటుంబాలకు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. గురువారం నాడు మృతుల కుటుంబసభ్యుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి 5వేల రూపాయల చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసి పసుల శ్రీవిద్య వెంకటేష్, నాయకులు యూనుస్, శ్రీనివాస్, బాల్‌రాజ్, సంజీవులు, రత్నం, ఆశన్న, అప్సర్, పద్మరావు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

**కేశంపేటచ మే 21, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని మంగలి గూడ గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున అక్రమంగా మట్టిని తరలిస్తుర్రన్న విశ్వాసనీయ సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తనిఖీలు నిర్వహించగా టిప్పర్‌లో మట్టిని రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్ వివరాలు తెలుసుకోగా టిప్పర్ డ్రైవర్ దార్లవత్ శ్రీను తండ్రి రాములు వయస్సు 28 సంవత్సరాలు నివాసం బోడ గుట్ట తండా పెద్దరేవెల్లి గ్రామం బాలనగర్ మండలంగా గుర్తించారు. వాహన యజమాని వివరాలను తెలుసుకోగా పుట్టగట్ల సత్తయ్య తండ్రి చంద్రయ్య నివాసం దుబ్బచెర్ల మహేశ్వరం మండలం అని తెలిసింది, ఈ వాహనాన్ని కొండని లక్ష్మణ్ అనే వ్యక్తి లీజుకు తీసుకొని మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారని విచారణలో తేలింది. ఈ ఘటనపై పోలీసులు టిప్పర్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి టిప్పర్ డ్రైవర్ ఓనర్ సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ నరహరి మాట్లాడుతూ అక్రమంగా మట్టిని తరలించడం చట్టరీత్యా నేరమని మట్టి, తవ్వకాలు ఇసుక రవాణాలకు ఎవరు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ నరహరి తెలిపారు.



పోలీసులు పట్టుకున్న టిప్పర్

## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**కొత్తూరు, మే, 21, ప్రభాతవార్త:** కొత్తూరు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొత్తూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, మరియు ముఖ్య నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రత్యేకంగా టీఎస్ఐఐసీ పరిధిలో ఏర్పాటు కానున్న ఇండస్ట్రియల్ పార్క్ కారణంగా గ్రామాల ప్రజలు, కార్మికులు ఎదుర్కొనే ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, భూములు కోల్పోయే రైతులు మరియు కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమస్యలను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కార్మికులు తెలిపారు. సర్పంచ్ బాసు నాయక్, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, గ్రామ పంచాయతీ కార్మిక సంఘ నాయకులు, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు, కార్మికులు

## ఐటీ రంగ అభివృద్ధికి మార్గదర్శకుడు రాజీవ్



రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

**కొత్తూరు, మే 21, ప్రభాతవార్త :** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ విప్లవానికి బలమైన పునాది వేసి, ఐటీ రంగ అభివృద్ధికి మార్గదర్శకుడిగా నిలిచిన మహానేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతపై అపార విశ్వాసంతో ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి, యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించిన గొప్ప సంస్కర్త అని పేర్కొన్నారు. దేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించేందుకు రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంఘం అధ్యక్షుడు జగన్, సిద్ధాపూర్ గ్రామ సర్పంచ్ విస్లావత్ బాసు నాయక్, ఎస్‌బి పల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, ఉప సర్పంచ్ దొబ్బల యాదయ్య, మాజీ ఎంపీటీసీ రాశుల జంగయ్య, లింగారం సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డు తరలింపు, నిధుల మంజూరుపై వినతి

**ఘట్‌కేసర్, మే 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌లోని డంపింగ్‌యార్డును తరలించాలని కోరుతూ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ గురువారం ఎంఎంసి కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ స్థాయి సమీక్షా సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశయాదవ్‌లతో పాటు ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ పాల్గొని డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కొండాపూర్ సమీపంలోని డంపింగ్‌యార్డుతో పరసర కాలనీలకు దుర్వాసన, వాయుకాలుష్యం ఏర్పడుతుందని మరోచోటుకు తరలించాలని ఆమె కోరారు. ఘట్‌కేసర్ మున్సిపల్ గత పాలకవర్గం రూ.12.33 కోట్లతో డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మాణం చేశారని తెలిపారు. సిమెంట్‌రోడ్లు, బిటి రోడ్లు, భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వేసవిలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అవసరమైన చోట్ల బోర్లు వేయించాలని పావనియాదవ్ కమిషనర్‌ను కోరారు.



ఎంఎంసి కమిషనర్ టివికె రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనియాదవ్

# రాజీవ్ సంస్కరణలతో విప్లవాత్మక పురోగతి

**తాండూరు టౌన్, మే 21, ప్రభాతవార్త :** దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని తాండూరులో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బాతుల నాగరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. రాజీవ్‌కాలనీలో ఆయన విగ్రహం జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సీనియర్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం రాజీవ్‌గాంధీ సేవలు కొనియాడారు. మాతాశిశు ఆసుపత్రిలో మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. తొలుత జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ధారాసింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పీ.నీరజాబాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ మరణాంతరం ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని గుర్తు చేశారు. దేశ పురోగాభివృద్ధికి అనేక సంస్కరణలు చేపట్టారని తెలిపారు. కమ్యూనికేషన్ల వ్యవస్థ, కంప్యూటరీకరణ వంటి విప్లవాత్మక పురోగతి సాధించారని కొనియాడారు. బాతుల నాగు మాట్లాడుతూ రాజీవ్ కారణంగానే రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యత లభించిందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కావలి సంతోష్, మాజీ కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, చెనిమిళ్ల మల్లన్న, లింగదల్లి రవి, సరితాగౌడ్, వెంకన్న, సీనియర్ నేతలు నయీమ్ అప్పు, కొర్వార్ నాగేష్, అధికార ప్రతినిధి గోపాల్, వడ్డె శ్రీనివాస్, జిలానీ, మడపతి శివకుమార్, కిష్టప్ప, అఖిల్‌బాబా తదితరులు పాల్గొన్నారు.



తాండూరు ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

# ఉదయం వేళలోనే ఉపాధి ముగించుకోండి

**కందుకూరు, మే 21, ప్రభాతవార్త :** ఎండలు తీవ్రంగా కాస్తున్నాయని ఈ విషయాన్ని గుర్తించి ఉపాధి హామీ కూలీలు తాము చేపట్టిన పనులను ఉదయం పూట వీలైనంత త్వరగా ప్రారంభించుకొని ముగించాలని డిఆర్‌డిఓ అధికారి శ్రీలత సూచించారు. గురువారం కందుకూరు మండలం నేదునూరు, బాచుపల్లి, పులిమామిడి గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏసిఎల్ బి. కిరణ్మయి, అడిషనల్ డిఆర్‌డిఓ సుభాషిని, ఎంపీడీవో సరిత, ఎంపీఓ గీత, ఏపీవో రవీందర్ రెడ్డితో కలిసి ఆయా గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. నేదునూరు గ్రామంలో అమలు జరుగుతున్న ఫీడర్ ఛానల్ వర్క్‌ను బాచుపల్లి గ్రామంలో నర్సరీ అభివృద్ధి మరియు బచ్చుకుంట టీ సీటింగ్ పనులను పరిశీలించారు. పులిమామిడి గ్రామంలో చేపట్టిన ఎస్‌హెచ్‌జి భవన నిర్మాణ పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. కూలి డబ్బులు సకాలంలో అందుతున్నాయా పనిచేసే ప్రాంతంలో సౌకర్యాలు అందుతున్నాయా ఏ సమయానికి వచ్చి పనులు చేస్తున్నారు.. అసౌకర్యాలు ఏమైనా ఉన్నాయా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ శ్రీలత మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలు ఉదయం త్వరగా వస్తే ఎండ తీవ్రత తక్కువగా ఉంటుందని సూచించారు. పది పనులలో పాల్గొనే కూలీలకు గ్రామపంచాయతీ నుండి సేవలు అందుతాయని సూచించారు. ఏసీఎల్ మాట్లాడుతూ ఆడపిల్లలను బాగా చదివించాలని అదేవిధంగా చిన్న వయసులో పెళ్లిళ్లు చేయరాదని సూచించారు. ఆడపిల్లలను చదివించి వారి కాళ్లపై వాళ్ల నిలబడేలా చూడాలని, ఆడపిల్లల్ని చదివిస్తే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, చదివించడం ద్వారా ఆ కుటుంబం ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి దోహదపడుతుందని తెలియజేశారు. ఈ విషయాన్ని ప్రతి అమ్మ గుర్తించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు స్వాతి రామకృష్ణారెడ్డి, యుగంధర్ రెడ్డి, రమేష్, ఈసీ సుగుణ, టిఏలు రవికుమార్, గోవర్ధన్, ఎఫ్ఏలు ఎస్ రాములు, బి రాములుతోపాటు ఆయా గ్రామాల ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల పరిశీలనకు వచ్చిన డిఆర్‌డిఓ అధికారి శ్రీలత

# అక్కడ ప్రయాణం దినదిన గండం

**ఘట్‌కేసర్ రూరల్, మే 21, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని ముత్వెల్లిగూడ గ్రామంలో రోడ్డు గుంతల మయంగా మారి ప్రయాణీకులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. కాచవాని సింగారం నుండి వయా ముత్వెల్లిగూడ మీదుగా ప్రతాప సింగారం గ్రామం వరకు గల రోడ్డు అక్కడక్కడ గుంతలతో ప్రయాణీకులకు ప్రాణ సంకటంగా మారింది. ప్రధానంగా ముత్వెల్లిగూడ గ్రామంలోని దాదాపు అర కిలోమీటరు వరకు గల రోడ్డు గుంతల మయంగా మారగా గతంలో గుంతల్లో డస్ట్‌తో నింపి గుంతలను పూడ్చారు. డస్ట్ నింపిన కొన్ని రోజులకే తిరిగి గుంతల మయంగా మారింది. దీంతో ఈ గ్రామం గుండా ప్రయాణించే వాహనాలతో పాటు ద్వీచక్ర వాహనదారులు తరుచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు మరమ్మత్తు పనుల కొరకు డస్ట్‌పోయగా వాహనాల రాకపోకలతో దుమ్ములేగుతోంది. గుంతల మయంగా మారిన రోడ్డును శాశ్వతంగా బీటీ రోడ్డు ఏర్పాటు చేసి గుంతలు లేకుండా రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ నుండి ఏకంగా గ్రేటర్‌లో కలిసి మల్కాజ్‌గిరి కార్పొరేషన్‌గా మారడంతో పాడైన రోడ్లకు కనీసం మరమ్మత్తు పనులైనా చేపట్టడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతల మయంగా మారిన రోడ్డుకు మరమ్మత్తు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రయాణీకులకు ప్రాణ సంకటంగా మారిన ముత్వెల్లిగూడలో రోడ్డు

## పుష్కర స్నానంతో పుణ్యం, పాప పరిహారం లభిస్తాయి : బ్రహ్మశ్రీ శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి

**సంజీవరెడ్డి నగర్, మే 21, ప్రభాతవార్త:** గురుగ్రహం మిథునరాశిలోకి ప్రవేశించిన సమయంలో సరస్వతి నదికి పుష్కరాలు వస్తాయని భక్తులు విశ్వసిస్తారని, ఈ పవిత్ర కాలంలో పుష్కర స్నానాలు ఆచరిస్తే ఎంతో పుణ్యంతో పాటు పాప పరిహారం కలుగుతుందని శ్రీ చాముండేశ్వరి అనుగ్రహ పీఠాధిప తులు బ్రహ్మశ్రీ శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి తెలిపారు. గురువా రం నుంచి కాళేశ్వరంలో ప్రారంభమైన శ్రీ సరస్వతి అంత్య పుష్కరాల్లో పాల్గొన్న ఆయన, శ్రీనగర్ కాలనీలోని రుద్రాక్ష వైభవం లో భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల్లో పాల్గొనడం వల్ల మనసుకు ప్రశాంతత లభించడంతో పాటు విద్యాభివృద్ధి కూడా కలుగుతుందని చెప్పారు. సరస్వతీ దేవి అనుగ్రహంతో జ్ఞానం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే దివ్య పంచ భూత అభిషేకాలకు సరస్వతి నది పుష్కర తీర్థాలను వినియోగి స్తామని వెల్లడించారు. కాళేశ్వరంలో సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తోందని, భక్తులంతా 12 రోజుల పాటు జరిగే ఈ పుష్కరా ల్లో పాల్గొని దేవతల అనుగ్రహం పొందాలని సూచించారు. పుష్కరాల్లో పితృదేవతలకు తర్పణం ఇస్తే వారి ఆశీర్వాదాలు కూడా లభిస్తాయని బ్రహ్మశ్రీ శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి తెలిపారు.





విద్యార్థి హనీతేజా రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్ కవిత

## ఎంసెట్ ఉత్తమ ర్యాంకర్‌కు అభినందన

**కేశంపేట, మే 21, ప్రభాతవార్త :** ఎంసెట్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 176వ ర్యాంకు సాధించిన హనీతేజా రెడ్డిని సర్పంచ్ బీసా కవితా కరుణాకర్ రెడ్డి అభినందించారు. ఇంకా కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉప సర్పంచ్ రవి నాయక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఋణమాఫీ అమలు ఎప్పుడు..?

**ఘట్‌కేసర్, మే 21, ప్రభాతవార్త:** ప్రభుత్వం 3వ విడత రైతుభరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమచేయాలని ఘట్‌కేసర్ మండల రైతు ఋణమాఫీ సాధన సమితి కన్వీనర్ కంట్లం గౌరీశంకర్ డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ లో గురువారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ చివరి నాటికి రైతుల ఖాతాలో 3వ విడత రైతుభరోసా డబ్బులు వేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికి వేయకపోవడంతో రైతుల ఎదురుచూస్తున్నారని తెలిపారు. సన్న, చిన్నకారు రైతులు ఋణాలఉ తీసుకువచ్చి పంటల సాగు చేస్తున్నారని ప్రభుత్వం నుంచి వచ్చే రైతు భరోసా డబ్బులు సకాలంలో రాక వ్యాపారులకు వడ్డీలు చెల్లించాల్సీ వస్తుందని వాపోయారు. ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో దాదాపు 1,200 రైతులు ఋణాలు పొందగా ఇప్పటి వరకు రైతు ఋణమాఫీ అమలఉ కాలేదని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఋణమాఫీ అమలు చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఘట్‌కేసర్ సొసైటీ రైతుల ఋణాలు మాత్రం ఎందుకు మాఫీ చేమడం లేదని వెంటనే ఋణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో వేసేలా చర్యలు తీసుకోవాలని గౌరీశంకర్ విజ్ఞప్తి చేశారు.

## కలెక్టర్ అనుమతితోనే టైపిస్ట్‌ను సరెండర్ చేశా..

**మత్స్యశాఖ అధికారి ఎ.సుకీర్తి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 21, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా మత్స్యశాఖలో పనిచేస్తున్న టైపిస్ట్ ఉమామహేశ్వరి తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని, జిల్లా కలెక్టర్ అనుమతితోనే మత్స్యశాఖ హెడ్ ఆఫీస్‌కు ఆమెను సరెండర్ చేయటం జరిగిందని, ఆమె చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా మత్స్యశాఖ అధికారిణి ఎ.సుకీర్తి తెలిపారు. గురువారం దీనికి సంబంధించి ఆమె పత్రికా ప్రకటనను విడుదల చేశారు. వివిధ పత్రికల్లో బుధవారం వచ్చిన వాటిపై, అదే విధంగ వార్తలో వచ్చిన 'ఏసిబికి ఫిర్యాదు చేస్తానన్నందుకు వేధింపులు' అనే శీర్షిక వెలువడటంతో జిల్లా అధికారిణి ఎ.సుకీర్తి స్పందించి దీనిపై ఖండించారు. టైపిస్ట్ ఉమామహేశ్వరి ముందస్తు అనుమతులు తీసుకోకుండానే విధు లకు గైర్హాజరు అవుతున్నందున కలెక్టర్ అనుమతి తీసుకునే ఈ నెల 11వ తేదీన సదరు ఉద్యోగిని మత్స్యశాఖ డైరక్టర్ ఆఫ్ ఫిషరీస్ హెడ్ ఆఫీస్‌కు సరెండర్ చేశామని, దీనిని గమనించాలని ఆమె వివరించారు. టైపిస్ట్ వ్యక్తిగత కక్షతో, దురుద్దేశంతోనే తనపై ఆరోపణలు చేసిందని దీన్ని తీవ్రంగ ఖండిస్తున్నట్లు జిల్లా అధికారిణి సుకీర్తి తెలిపారు. ఆమెకు కార్యాలయంకు సంబం ధించి, సిబ్బందికి సంబంధించిన నెలవారి జీతాలు, బిల్లులు, ఇంక్రిమెంట్లు ఇతర అనుబంధ బిల్లుల తయారు విధులు మాత్ర మే నిర్వహిస్తారని, క్షేత్రస్థాయి కార్యకలాపాలు, పథకాలు లబ్ది దారులకు సంబంధించినవి, ఆర్థిక మంజూరుకు సంబంధించిన ఏ ఫైళ్లను ఆమెకు అప్పగించలేదని ఆమె వివరించారు. టైపిస్ట్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, అవాస్తవమని జిల్లా అధికారిణి ఎ.సుకీర్తి పేర్కొన్నారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతిని మరిచిన కాంగ్రెస్ నేతలు

**అత్తాపూర్ మే 21,ప్రభాతవార్త :** భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని రాజేంద్రనగర్ సర్కిల్ కాంగ్రెస్ నాయకులు చర్చనీయాం చకంగా మారింది. రాజేంద్రనగర్ సర్కిల్లో ఏడు డివిజన్లో కాంగ్రెస్ నాయ కులు వివిధ పదవులు అనుభవిస్తున్నారు. ఇటీవల నామినేటెడ్ పదవులను సైతం పొందారు.. అయినా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన స్వర్గీయ రాజీ వ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తుంది. స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి కాంగ్రెస్ నాయకులకు తెలియదా... తెలిసిన ఎందుకు నిర్వహించాలని మర్చిపో యారా అని పలువురు చర్చించుకుంటున్నారు. కరుడుగట్టిన కాంగ్రెస్ వాదు లు... ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు సైతం రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించకపోవడం బాధాకరమని పలువురు విశ్లేషకులు అంటు న్నారు. పదవులు, ప్రజా ప్రతినిధులుగా ఎన్నో కాంగ్రెస్ పార్టీ నుండి అనుభ వించి పార్టీ దేశాదినేతకు నివాళులు అర్పించకపోవడం విశేషంగా మారింది.

# ఐఎఎస్ అధికారులు ఉన్నా ఆగని అవినీతి, అక్రమ వసూళ్ళు..

**-అవినీతిలో రికార్డు సృష్టిస్తోన్న కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్(సీపీ) కార్యాలయం**

**-నిర్మాణ అనుమతులు, ఓసీల జారీలో అధికారుల అవినీతి లీలలు..**

**కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, మే21ప్రభాతవార్త:** కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్(సీపీ) కార్యాలయంలో భవన నిర్మాణాల అనుమతులతోపాటు ఓసీల జారీలో పెద్ద ఎత్తున అక్రమ వసూళ్ళు.. అక్రమాలు జరుగుతు న్నాయి. అయితే సీఎంసీ కార్యాలయంతోపాటు కూక ట్‌పల్లి జోన్లకు ఇద్దరు ఐఎఎస్ అధికారులు ఉన్నా ఈ కార్యాయలంలో అవినీతి రోజు రోజుకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రూ.లక్షలు ఖర్చుపెట్టి ఇక్కడ సీటు దక్కిచుకున్న ఓ కీలక అధికారితోపాటు కొందరు అధికారులు అనుమతులు, ఓసీల జారీలో రూ.కోట్లు దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అడ్డూ అదుపు లేని సదరు అధికారి అక్రమాలురెచ్చిపోతున్న అవినీతి తిమింగలాలతో కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ (సీపీ) కార్యాలయం అవినీతిలో రికార్డు సృష్టిస్తోంది. కూకట్‌పల్లి, మాదాపూర్, ఆల్విన్‌కాలనీ, మూసాపేట సర్కిళ్లలో బహుళంతస్తుల భవనాలతోపాటు కమర్షి యల్ భవనాలు పెద్దఎత్తున వెలస్తున్నాయి. బహుళ అంతస్తుల నిర్మాణాలు, కమర్షియల్ నిర్మాణాల అనుమతులకు ఒక్కో దానికి ఒక్కో రేటు కట్టి సదరు అధికారి ఇష్టారాజ్యంగా తన కింద పనిచేసే కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులతోపాటు బ్రోకర్లు, లైసెన్స్ ప్లానర్లతో అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. సిటీ ప్లానర్ కార్యాలయంలో సదరు అధికారి, ఓ ఏసీపీ తమ ఇష్టారాజ్యంగా వ్యవ హరిస్తుండగంతో దరఖాస్తుదారులు, బిల్డర్లు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. తమ వద్దకు వచ్చే ఏ పనికైనా అడిగినన్నీ ముడుపులు ఇస్తేనే పనులు చేస్తు న్నారని లేకుంటే తమ చుట్టూ నెలల కొద్ది తిరుగాల్సి న పరిస్థితిని సృష్టిస్తున్నారని పలువురు పేర్కొంటు న్నారు. ఓ ఇద్దరు అధికారులు అక్రమాలకు పాల్పడు తూ గతంలో పనిచేసిన ప్రాంతాలో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న చోట పెద్ద ఎత్తున అక్రమ వసూళ్ళకు పాల్పడి రూ.కోట్ల మేర అక్రమ ఆస్తులు సంపాదించినట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. అవినీతి నిరోదక శాఖ (ఏసీబీ) దృష్టిసారించకపో వడంతో అక్రమార్కులు మామూళ్ళ కోసం తహ తహ లాడుతూ మరింత రెచ్చిపోయి జేబులు నింపుకో వడంలో బిజీగా ఉంటూ దరఖాస్తుదారులకు ముదు పుల కోసం పగలే చుక్కలు చూపిస్తున్నారు.

**సిటీ ప్లానర్ కార్యాలయంలో ఓ అధికారి ఇష్టారాజ్యం..**

కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్(సీపీ) కారా ్యలయంలో ఓ కీలక అధికారి బహుళంతస్తుల నిర్మాణాల అను మతులకు ఓ రేటుభవనాల ఆక్యూపెన్సీ(ఓసీల)జారీకి మరో రేటు కట్టి పెద్ద మొత్తంలో వసూళ్ళకు పాల్పడు తున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. తన కార్యాల యాన్ని అక్రమాలకు అడ్డాగా మార్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నప్పటికీ సీఎంసీ కమిషనర్, జోన్ కమిషనంల్ పట్టించుకోవడంలేదనేవిమర్శలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణాల అనుమతులకు అమ్యా మ్యాలతోపాటు అక్రమ భవన నిర్మాణాలు సక్రమంగా కొనసాగేందుకు గాను కొందరు అధికారులు రూ.కోట్లలో చేస్తున్న అక్రమ వసూళ్ళపై అవినీతి ని రోధక శాఖ (ఏసీబీ) దృష్టిసారించడంలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో టౌన్‌ప్లానింగ్ విభాగం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందన్న ఆరోపణలు ఉన్నా యి. కొందరు ఏసీపీలు అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందిస్తూ భవన నిర్మాణ అనుతుల ద్వారా బల్దియాకు రావాల్సి న నిధులు సిబ్బంది జేబులు నింపుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. వివాదస్పదమైన భూముల్లో, నిర్మాణ, అనుమతు ల్లేకుండా కొనసాగే నిర్మానాలకు టౌన్‌ప్లానింగ్ అధికా రులు అండదండలు ఇస్తూ నిర్మాణ అనుమతులకు ఫీజు రుపేణా రావాల్సి న నిధులను కాజేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తీసుకున్న అనుమతులకు అ నుగుణంగా భవనాలను నిర్మించారా లేదా అనే విష యాన్ని పరిశీలించాలి. తీసుకున్న అనుమతుల ప్రకా రం భవన నిర్మాణం అయిందా, లేదా అన్న విషయా న్ని క్షేత్రస్థాయిలో తనికీ చేసుకున్న తర్వాతే అధికా రులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంటుం ది. అయితే అందుకు విరుద్దంగా నిబంధనలకు విరు ద్దంగా నిర్మించిన భవనాలకు కూడా ఆక్యూపెన్సీ (ఓసీలు) జారీచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.లక్షలాది రూపాయలనుముడుపులు దండుకుని ని బంధనలకు విరుద్దంగా నిర్మించిన భవనాలకు కూడా ఓసీలను జారీచేస్తూ జేబులు నింపుకుంటున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. కొందరు టౌన్‌ప్లానింగ్ అధికా రులు రూ.కోట్ల మేర అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# సొంతింటి కలపై అదనపు భారం..

(మొదటి పేజీ తరువాయి)

ఛార్జీల పెంపు ముంగిట ఉండటంతో.. పెట్టుబడిదారులు, సాధారణ కొనుగోలుదారులు అప్రమత్తమయ్యారు. అదనపు భారం నుంచి తప్పించుకునేందుకు వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు.

ప్రస్తుతం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి. ఎలాగైనా పాత ధరలకే భూములు, ఇండ్ల రిజిస్ట్రేషన్లు ముగించుకోవాలనే ఆరాటంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

**రియల్ డల్ తప్పదా?**

రిజిస్ట్రేషన్ల భారం పెరగనుండటంతో రాబోయే రోజుల్లో రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో లావాదేవీల వేగం తగ్గి, కొంతకాలం పాటు నిశ్శబ్ద వాతావరణం నెలకొనే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్‌ను సర్దుబాటు చేసుకోవడానికి కొనుగోలుదారులు సమయం తీసుకునే అవకాశం ఉంది. అయితే, ఈ నిర్ణయంలో ఒక సానుకూల కోణం కూడా ఉంది. ప్రభుత్వ మార్కెట్ విలువలు.. బహిరంగ మార్కెట్ (ఓపెన్ మార్కెట్) ధరలకు దగ్గరగా రావడం వల్ల రియల్ ఎస్టేట్‌లో బ్లాక్ మనీ (నల్లధనం) లావాదేవీలకు చెక్ పడే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వ విలువ తక్కువగా, ఓపెన్ మార్కెట్ రేటు ఎక్కువగా ఉండటం వల్ల మిగిలిన మొత్తాన్ని నగదు రూపంలో మార్పిడి చేసేవారు. తాజా సవరణలతో పారదర్శకత పెరిగి, బ్యాంకింగ్ ఛానెల్స్ ద్వారానే ఎక్కువ లావాదేవీలు జరిగే అవకాశం ఉంది.

**28న అధికారిక ప్రకటనపై ఉత్కంఠ**

కొత్త గైడ్‌లైన్ మార్కెట్ విలువలపై ప్రభుత్వం ఈనెల 28 అధికారిక ప్రకటన చేసే అవకాశముందని తెలుస్తోంది. ప్రజల అభ్యంతరాలు, సూచనలు స్వీకరించిన అనంతరం తుది ధరలను అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలోని భూముల యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొనుగోలుదారులు ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 10లోపే ఉపాధి పనులు ముగించాలి


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

**వికారాబాద్,మే 21, ప్రభాత వార్త:** జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు వహించాలని, ఉదయం 5:30 గంటల నుండి 10 గంటల లోపే తమ పనులను పూర్తి చేసుకుని ఇళ్లకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. గురువారం వికారాబాద్ మండలం లోని పులుమద్ది గ్రామంలో జిల్లా కలెక్టర్, ఎంపీడీఓ వినయ్ అధికారులు కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీ లించి, కూలీలతో నేరుగా మాట్లాడారు. ఎండ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారికి అవగాహన కల్పించారు. అదేవిధంగా, గ్రామంలో జాబ్ కార్డులు లేని వారికి కూడా వెంటనే ఉపాధి కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సంబంధిత అధికారులను, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

# అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత


పశువులతో రవాణా చేస్తున్న వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

**మేడ్చల్, మే 21, ప్రభాతవార్త :** అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని మేడ్చల్ పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని డబిల్‌పూర్ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద గురువారం పోలీసులు సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో నిజామాబాద్ నుండి నగరానికి వెళుతున్న డిసిఎం వాహహంపై అనుమానం వచ్చి ఆపి చూడగా అందులో 35 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇరుకుగా వాటిని తరలిస్తున్నారు. ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని పశువులతో పాటు మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పశువుల రవాణ అనుమతుల పత్రాలు, వాటిని ఎక్కడికి తరలిస్తున్నారనే అంశాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ మేరకు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

**–రైతులకు ఇబ్బందులను కలగకుండా చూడాలని ఆదేశం**

**దౌల్తాబాద్,మే 21,ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని దేవర్‌ఫస్లావాద్ గ్రామంలో గురువారంరోజు జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటచారి విస్తృతంగా పర్యటించి వరి కొనుగోలు కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సంధర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ...ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగాలని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు,ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ పర్యటనలో మండల తహసీల్దార్ గాయత్రి,డిప్యూటీ తహసీల్దార్(డీటీ) వెంకటచారి,స్థనిక ప్రజా ప్రతినిధులు,రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వెంకటచారి

# పొద్దుతిరుగుడు పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**కొనుగోలు కేంద్రం ఓపెన్ చేసి ఎందుకు బందు చేశారు?**

**నిలదీసిన సి పి ఎం నాయకులు**

**తలకొండపల్లి, మే21,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో ఉన్న దాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం స్థానిక నాయకత్వం కానుగుల వెంకటయ్య శివ గళ్ళ రమేష్‌ల ఆధ్వర్యంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి , రైతు సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బాక రామ్ చందర్ వెళ్లి పరిశీలించడం జరిగింది. అనంతరం రైతుల బాదసాధకాల్ని అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ తలకొండపల్లి మండలంలో దాదాపు 1800 ఎకరాలలో పొద్దుతిరుగుడు సాగు చేశారని దానికి ప్రభుత్వమే సబ్సిడీ విత్తనాలు ఇచ్చి సబ్సిడీ మందులు ఇచ్చి రైతులను పెద్ద ఎత్తున పొద్దుతిరుగుడు సాగు చేయాలని ప్రోత్సహించి పంట చేతికి వచ్చిన తర్వాత రెండు నెలలు గడుస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ రైతుల పంటను కొనకుండా రోడ్డు పక్కల వందల క్వింటాళ్ల పొద్దు తిరుగుడు గింజల ధాన్యం దాదాపు రెండు నెలలుగా అక్కడే ఉండడం పండించిన పంట అమ్ముడుపోక రైతులు దిగాలుగా ఉన్నారన్నారు, వ్యవసాయ అధికారుల్ని సహకార సంఘం వాళ్ళని సంప్రదించినప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన పంటని పూర్తిచేసి 3000 బస్తాలు రైతుల నుండి సేకరించామన్నారు. ఇంకా దాదాపుగా ఒక తలకొండపల్లి మండలం లోనే 30 వేల బస్తాలకు పైగా రైతుల దగ్గరే ఉందన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 7721 రూపాయలకు ధర నిర్ణయించినప్పటికీ రైతులు పంట అమ్ముడుపోక అప్పులు తీరలేక చివరికి జడ్చర్ల మార్కెట్‌కు తరలించి ప్రైవేట్ వ్యక్తులకు 6000 కి అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల వల్ల రైతాంగం నిలువునా దోపిడీ గురవుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేసి ఇబ్బందుల్లో ఉన్న రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు .స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని వెంటనే కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రం దగ్గర కనీస వసతులు లేక మంచినీళ్లు మజ్జిగ అంబలి లాంటివి పెట్టకుండా ఎర్రటి ఎండలో రైతుల అవస్థ పడుతున్న కనీస సౌకర్యాలు కల్పించకపోవడం విడ్డూరమన్నారు .కావున రైతుల్ని, హమాలీలని ఈ ఎండల సందర్భంగా కాపాడుకోవాల్సిన బాధ్యత కొనుగోలు కేంద్ర యాజమాన్యంపై నిన్న ఒక్కరోజే రాష్ట్రంలో వడదెబ్బతో 11 మంది చనిపోయారు అన్నారు. మొత్తం పొద్దు తిరుగుడు సాగు కేశంపేట్ తలకొండపల్లి ఆమనగల్ కడ్తాల్ మాడుగుల కందుకూర్ మండలాల్లో దాదాపు 4 వేల పైచిలుకు ఎకరాల్లో పంట పండించాలని అన్నారు. సగటున ఎకరాకు 10 క్వింటాళ్ల పండుతున్నప్పుడు ఈ ప్రాంతంలో 40,000 క్వింటాలకు అదనంగా పంట దిగుబడి వస్తుందని వాటిని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కందుకూరు మండలం నేదునూరులో 600 ఎకరాల్లో కుసుమ పంట పండించిన వారి ధాన్యం కూడా కొనుగోలు చేయకపోతే రైతులంతా ఆందోళన చేసిన కనీసం ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఇందులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అలాగే మంత్రి సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో జోక్యం చేసుకుని వెంటనే పరిష్కారం చేయకపోతే ఈ ప్రాంతంలో ఉన్న రైతులందరిని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పెంటయ్య బట్టు పర్వతాలు రంగారెడ్డి అనేక మంది రైతులు కూలీలు పాల్గొన్నారు.


ఆర్, కృష్ణయ్యతో మాట్లాడుతున్న మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ఆశిరెడ్డి.

## రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధరకు చెల్లించాలి

**మండల జీజేపి పార్టీ అధ్యక్షులు ఆశిరెడ్డి**

**మోమిన్‌పేట్, మే 21. ప్రభాతవార్త:** నిత్యం మట్టిలో పని చేస్తూ, భూమినే నమ్ముకొని నిరంతరం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం తగిన మద్దతుధర కల్పించి సకాలంలో సేకరించాలని గురువారం జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు టైగర్ ఆర్, కృష్ణయ్య తో కలిసి మోమిన్‌పేట్ మండల రైతుల గురించి కృష్ణయ్యతో విన్నవించినట్లు తెలిపారు. ఈ సంధర్భంగా అధ్యక్షులు ఆశిరెడ్డి తను మండల బీజేపి పార్టీ అధ్యక్షుడిగా మండ లంలోని అన్ని గ్రామాలలో తిరిగి పర్యవేక్షించగా రైతులు వ్యవ సాయాన్నే నమ్ముకొని కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పంటకు తగిన మద్దతు ధర ప్రకటించి సకాలంలో కొనుగోలు చేయాలని ఆశిరెడ్డి కోరారు. అందుకు రైతన్నలు పడుతున్న కష్టాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వ్యవసాయంపై ఆధార పడ్డ రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. అందు కు సానుకూలంగా స్పందించిన ఆర్, కృష్ణయ్య స్పందించి మన మోమిన్‌పేట మండల రైతులకు త్వరలో న్యాయం చేద్దామని, అలాగే వారు పండించిన పంటలకు తగిన మద్దతు ధర కల్పించి కొనుగోలు చేసే విధంగా తను తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారని ఆశిరెడ్డి తెలిపారు.

## గత పాలకుల వైఫల్యమే జవహర్ నగర్ డంపింగ్ కొండకు కారణం

**డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్**

**జవహర్ నగర్,మే 21, ప్రభాత వార్త:** గత ప్రభుత్వాల పాలకుల వైఫల్యాల కారణంగానే జవహర్ నగర్ ప్రాంత ప్రజలు డంపింగ్ యార్డ్ సమస్యతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ విమర్శించారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని ఆయన తెలిపారు.జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో వజ్రేష్ యాదవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 4వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా డంపింగ్ యార్డ్ సమస్యపై స్పందించి, దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. ఈ విషయానికి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి సాక్షులని పేర్కొన్నారు.



జవహర్ నగర్‌లో చెత్త కొండలా పేరుకుపోయిన పరిస్థితికి గత పాలకుల నిరక్ష్య్యమే కారణమని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సమస్య తీవ్రతను గుర్తించి, శాశ్వత పరిష్కార దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నారని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని వజ్రేష్ యాదవ్ అన్నారు.

## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

**మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి, ఎసిపి జానకి రెడ్డి**

**కడ్తాల్ మే 21, ప్రభత వార్త:** కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెక్‌పోస్ట్ వద్ద డీసీపీ మహేశ్వరం నారాయణరెడ్డి, ఏసీపీ మహేశ్వరం జానకి రెడ్డి ఆధ్వర్యంలో కడ్తాల్ పట్టణంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ మరియు సంబంధిత పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించ వచ్చని తెలిపారు. మైనర్ పిల్లలు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్ర త్తలు తీసుకోవాలని సూచిస్తూ, పిల్లలకు మరియు వారి తల్లిదండ్రులకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు.

మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అతివేగం ప్రాణాంతకమని అధికారులు హెచ్చరించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.



అలాగే యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలని, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ సైదిరెడ్డి, ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సాంకేతిక విప్లవ ప్రదాత రాజీవ్ గాంధీ


రాజీవ్ గాంధీ చిత్ర పటాన్ని పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలి

**కోలుకుంద సంతోష్ కుమార్**

**ధారూర్, మే 21, ప్రభాత వార్త:** ధారూర్ మండల కేంద్రంలో మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి 35వ వర్ధంతి కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాన్‌సింగ్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘననివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎపిసిసి యువజన కాంగ్రెస్ జనరల్ కార్యదర్శి కోలుకుంద సంతోష్ కుమార్ , డిసిసి వికారాబాద్ జనరల్ కార్య దర్శి బాబా ఖాన్, మాజీ జెడ్పీటీసీ కుక్కింద రాములన్న పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎపిసిసి యువజన కాంగ్రెస్ జనరల్ కార్యదర్శి కోలుకుంద సంతోష్ కుమార్ మాట్లాడుతూ, భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక రంగంలో ముందుకు నడిపించిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశంలో కంప్యూటర్ విప్లవానికి నాంది పలికి, టెలికాం రంగ అభివృద్ధికి కృషి చేసి యువతకు కొత్త అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషిచేసి గ్రామీణాభివృద్ధికి ప్రాధా న్యత ఇచ్చారని తెలిపారు. 18 సంవత్సరాల యువతకు ఓటు హక్కు కల్పించి యువశక్తికి రాజకీయాల్లో స్థానం కల్పించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీనేనని అన్నారు. విద్య, విజ్ఞానం, సాంకేతికత రంగాల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చి దేశ అభివృద్ధికి పునాది వేసారని కొనియాడారు. దేశానికి చేసిన విశిష్ట సేవలకు గాను రాజీవ్ గాంధీ గ భారత దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న"ను మరణానంతరం ప్రదానం చేయడం ఆయన గొప్పతనానికి నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుజ్జయ్య గౌడ్, లాల్ మహమ్మద్ , అమరేశ్వర్ పటేల్, కిరణ్ కుమార్ , బలవర్ధన్ రెడ్డి , జనార్దన్ రెడ్డి, జాకీర్, అశోక్, యాదగిరి, అనంతయ్య, ఆంజయ్య, మల్లికార్జున పాల్గొని రాజీవ్ గాంధీ గారికి ఘన నివాళులర్పించారు.

## రాజీవ్‌గాంధి సేవలు చిరస్మరణీయం


పెద్దెముల్‌లో రాజీవ్‌గాంధి వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

**...మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి**

**పెద్దేముల్, మే 21, ప్రభాతవార్త:** దేశాభివృద్ధికి దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధి చేసిన సేవలు చిరస్మరణీయమని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు రుద్రారంపి.మహిపాల్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధి వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పి.మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ సమాచార సాంకేతిక రంగం, కంప్యూటర్ విప్లవానికి రాజీవ్‌గాంధి పునాదులు వేసారని గుర్తుచేశారు.దేశ సమగ్రత, జాతీయ ఐక్యత కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. రాజీవ్‌గాంధి ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కోటపల్లి మార్కెట్ కమిటి వైస్‌చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, మైనార్టీ కన్వీనర్ యండి. రియాజ్, జిల్లా ఉపాధ్యాక్షులు శోభారాణి, ఎల్లారెడ్డి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్ కుమార్ గుప్తా, మార్కెట్ కమిటి మాజీ ఉపాధ్యాక్షులు జితేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రకళ, అరుణ, నాయకులు కోహీర్ రవి, డివైనర్సిములు, మైపూస్, జనగాం మదురెడ్డి, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఎదులాబాద్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మహేశ్‌గౌడ్, అమరేందర్ తదితరులు

## రాజీవ్‌గాంధీ 35వ వర్ధంతి..నేతల నివాళి

**ఘట్‌కేసర్, మే 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లో గురువారం మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ 35వ వర్ధంతి నిర్వహించారు. ఎదులాబాద్‌లోని చౌరస్తా వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహానికి పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కీసరగుట్ట డైరక్టర్–కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సామల అమరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ పాల్గొని రాజీవ్‌కు నివాళులు అర్పించి మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లిన రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీమన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ మాజీ డైరక్టర్లు గాయరు విశ్వనాధం, జవాజి సత్తయ్య, మాజీ ఉపసర్పంచులు ఆకిటి సుధాకర్‌రెడ్డి, బాలవెంకటేశ్, మండలమాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి.ఇక్బాల్, మాజీ వార్డుసభ్యులు మెట్టు రమేశ్, బింగి సురేశ్‌గౌడ్, నాయకులు బింగి రాజేందర్‌గౌడ్, మెట్టు నర్సింహ్మా, కూరం గిరిబాబు, పోలీస్ కృష్ణ, జంగయ్యయాదవ్, సార సురేశ, మంకం శ్రీను, బద్దం వెంకటేశ్, పూస సాంబ రమేశ్, తోటకూరి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**రాజీవ్‌గాంధీకి ఘనంగా నివాళులు**

**..అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి**

**శామీర్‌పేట, మే 21, ప్రభాతవార్త:** దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్దంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్‌లు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దీనిలో వారితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు.


అలియాబాద్‌లో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్,పాల్గొన్న తదితరుల దృశ్యం

గురువారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటంకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగ పలువురు ప్రజాప్రతినిధులు, కాంనరగెస్ పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ చేసిన సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు కంటం కృష్ణారెడ్డి, కౌన్సిలర్ సామల జశ్వంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరక్టర్ తుంకి బిక్షపతి, సీనియర్ నాయకులు కొంగ విఠల్, ఎ.భాస్కర్‌గౌడ్, ముద్దం రాఘవరెడ్డి, నాటకారి వెంకటయ్య, గోలిపల్లి నాగమల్లారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.


.దేవరయాంజాల్‌లో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి,పాల్గొన్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం

**రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం**

**శామీర్‌పేట, మే 21, ప్రభాతవార్త:** దివంగత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం శామీర్‌పేట మండలంలోని దేవరయాంజాల్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. దీనిలో పలువురు మాజీ ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ నాయ కులు పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి మాట్లా డుతూ రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలు మరిచి పోలేనివని అన్నారు. దేశాన్ని 21వశతాబ్దం వైపు నడిపించి దూరదుష్టి గల నాయకునిగా చరిత్రలో ఆయన నిలిచారని గుర్తు చేశారు. ప్రధానంగ కంప్యూటర్,టెలికామ్ రంగంలో సంస్కరణలు తెచ్చి దేశాన్ని సాంకేతిక యుగంలోకి తీసుకవెళ్లిన గొప్ప నాయకులు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. యువతకు ఆదునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించి భారత భవిషత్‌కు పునాది వేసిన మహానాయకులు అని జైపాల్‌రెడ్డి అన్నారు. 18సంవత్సరాలకే యువతకు ఓటు హక్కు కల్పించిన నాయకులు రాజీవ్‌గాంధీ అని ఆయన అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించటం మహిళల పాత్రను బలపరిచారని ఆయన అన్నారు. రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అభివృద్దిలో, సంక్షేమంలోనూ ముందుకు వెళుతుందని జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి పి.బాలేశ్, మాజీ ఉపసర్పంచు టి.శంకర్‌గౌడ్, రామాలయ మాజీ చైర్మన్ పి.లక్ష్మినారాయణ, మాజీ ధర్మకర్తలు మురళిగౌడ్, బి.కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, బి.జనార్దన్‌రెడ్డి, కె.రాము, ఎం.సాయికుమార్, ఎస్.ఆనంద్, సి.బిక్షపతి, బి.భూపాల్‌రెడ్డి, కె.లక్ష్మణ్, జి.బాబు, బి.మధుసూదన్‌రెడ్డి, సి.మణిదీప్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

**రాజీవ్‌గాంధీ వర్ధంతిన ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ**

**ఘట్‌కేసర్, మే 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో గురువారం మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ 35వ వర్ధంతిని నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వాసవీటవర్స్ వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పలువురు నాయకులు, మాజీప్రజాప్రతినిధులు పూలదండ వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ పాటు డిసిసి ప్రధానకార్యదర్శి ఇటిక్యాల బాలకృష్ణారెడ్డి, డిసిసి కార్యదర్శి మామిండ్ల ముత్యాలుయాదవ్ నాయకులు పాల్గొని మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ శాస్త్రసాంకేతిక రంగానికి ఎంతో సేవలు అందించారని యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కును కల్పించారని కొనియాడారు. రాజీవ్‌గాంధీ హాయాంలో దేశంలో టెక్నాలజీ రంగం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. అనంతరం ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రిలో నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ పవర్‌గ్రిడ్ వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ వర్దంతిని జరిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, కీసరగుట్ట డైరక్టర్లు సగ్గు అనిత, సామల అమరేందర్, మత్స్య సొసైటీ జిల్లా డైరక్టర్ మెడబోయిన వెంకటేశ్ ముదిరాజ్, మాజీ కౌన్సిలరు కుతాడి రవీందర్, మాజీ సర్పంచులు వేముల మమత, నానావత్ రూప్‌సింగ్‌నాయక్, బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచులు వేముల సత్తయ్యగౌడ్, వేముల పరమేశ్‌గౌడ్, సొసైటీ మాజీ డైరక్టర్లు బొక్క ప్రభాకర్ రెడ్డి, గాయరు విశ్వనాధం, పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ బొక్క సుధాకర్‌రెడ్డి, డిసిసి మాజీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మాజీ వార్డుసభ్యులు మెట్టు రమేశ్, నానావత్ సురేశ్‌నాయక్, పైళ్ల లతరెడ్డి, దొంకెని శంకర్‌గౌడ్, ముద్దం మల్లేశ్‌యాదవ్, మైనారిటీసెల్ అధ్యక్షులు ఎం.ఎ.ఫారూఖ్, నాయకులు కవాడి మాధవరెడ్డి, బొక్క సత్తిరెడ్డి, మేకల సునీల్‌కుమార్, నర్సింగ్‌రావు, వేముల పరమేశ్‌గౌడ్, విజయ్, కట్ట సుధాకర్‌రెడ్డి, బొక్క నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌లో రాజీవ్‌గాంధీకి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి**

**కుల్కచర్ల,మే,21 ప్రభాతవార్త:** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి,పిఎసిఎస్ ఛైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు,అన్నారు. మండల పరిధిలోని పిరంపల్లి గామంలో బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ గడ్డం వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ...ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.రైతులు ధాన్యం పూర్తిగా అరబెట్టి కేంద్రానికి తీపుకు రావాలన్నారు.ధాన్యం తీసుకొచ్చిన రోజే పూర్తి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. తేమ శాతం పరిశీలించి,ధాన్యం తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోపాల్ నాయక్,మార్కెట్‌కమిటి డైరెక్టర్ భరత్ కుమార్ రెడ్డి,ఉప సర్పంచ్ శాంత మొగులయ్య, సీనిమర్ నాయకులు సత్యనారాయణ,మురళీకృష్ణ,జి.రమేష్,వార్డు సభ్యులు శ్రీలత శ్రీశైలం,కిష్టమ్మ,ఆయ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీలకు అల్పాహారం అందజేత



కూలీలకు అల్పాహారం అందజేస్తున్న సర్పంచ్

**కుల్కచర్ల,మే,21 ప్రభాతవార్త:** ఉపాధి హామీ పనులు ఉదయం సమయంలోనే పూర్తి చేసుకోవాలని సర్పంచ్ రవీందర్ నాయక్ పేర్కొన్నారు.గురువారం మండల పరిధిలోని చెరువుముందలి తాండ (ఎ) గ్రామ పంచాయతీ ఉపాధి హామీకూలీలకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ..ఎండలు తీవ్రత నుండి రక్షణకు టెంట్లు లేద చెట్ల నీడకు ఉండాలని సూచించారు.పని సమయంలో తాగు నీరు వెంట తెచ్చుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి, టిఎ మహెశ్వరి,ఫిల్డ్‌అసిసెంట్ చంద్రమౌళి,ఉప సర్పంచ్ టోప్యా తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహమీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

**సర్పంచ్ చంద్రభూపాల్ రావు**



ఉపాధిహమీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

**కుల్కచర్ల,మే,21 ప్రభాతవార్త:** వలసల నివారణకు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చంద్రభూపాల్ రావు పేర్కొన్నారు.గురువారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సందర్శించారు.ఈ సందర్భంగా కూలీలతో సర్పంచ్ చంద్రభూపాల్ రావు మాట్లాడుతూ.. ఎండలు ఎక్కువ ఉండడంతో ప్రజలకు మంచినీరు.ఎంతో ఆవసరమని వెంట తేచ్చుకోవాలని సూచించారు. ఉపాధిహాయీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పని చేస్తే సంవత్సరానికి సుమారు రూ.30700 అందుతాయని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఉపాధిహమీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఎండల పెరిగిపోవడంతో ఉదయం సమయంలోనే పనులు పూర్తి చేసుకొని ఇంటికి చేరుకోవాలని సూచించారు.పని ప్రదేశాల్లో తాగునీరు తప్పకుండా తీసుకెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్,ఫీల్డ్‌అసిస్టెంట్ అనంతయ్య కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## విఓఏల సమ్మెకు బిఆర్ఎస్ నాయకుల మద్దతు

**-నాలుగో రోజుకు చేరిన దౌల్తాబాద్ విఓఏల నిరసన దీక్ష..**

**-సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వంపై డిమాండ్**

**దౌల్తాబాద్,మే 21,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయం ఆవరణలో వీఓఏలు చేపట్టిన నిరసన సమ్మె గురువారంతో నాలుగో రోజుకు చేరుకుంది.ఈ దీక్షా శిబిరాన్ని బీఆర్ఎస్ నాయకులు సందర్శించి తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు.ఈ సంధర్బంగా మాజీ జెడ్పీటీసీ కోట్ల మహిపాల్,మాజీ వైస్ఎంపీపీ మహిపాల్‌రెడ్డి మాటా ్లడుతూ..నెలకు కేవలం రూ.5వేలు జీతంతో నేటి కాలంలో



సమావేశంలో మాట్లాడుతుతున్న మాజీ వైస్ఎంపిపి మైపాల్‌రెడ్డి

విఓఏలు కుటుం బాలను పోషించడం చాలా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పగలు,రాత్రి కష్టపడుతూ మహిళా సంఘా లకు చేదోడుగా ఉంటున్న విఓఏలకు కనీసం రూ.20 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తక్షనమే స్పందించి విఓఏల సమస్యలను పరిష్కరించాలని,లేని వక్షంలో ఈ ఆందోళనను కలెక్టరేట్ స్థాయికి తీసుకెళ్తామని,విఓఏల పోరాటానికి తాము వెన్నంటి ఉంటామని ప్రభుత్వాన్ని డిమాండ్

## రైస్ మిల్‌ను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



రైస్ మిల్ యాజమాన్యానికి సూచనలిస్తున్న అడిషనల్ కలెక్టర్

**దుద్యాల్, మే 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గౌరారం లో గల పారాబాయిల్డ్ రైస్ మిల్‌ను అడిషనల్ కలెక్టర్ వెంకట చారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హమాలీల సంఖ్యను పెంచాలని, లారీలను వెనువెంటనే అన్ లోడింగ్ చేయాలని మిల్లు యాజమాన్యానికి సూచించారు. అన్ లోడింగ్ కి వచ్చే లారీలు, ట్రాక్టర్లను క్రమ పద్ధతిలో టోకెన్లు ఇచ్చి అన్ లోడింగ్ చేయించాలన్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా డ్రైవర్లకు రైతులకు భోజన వసతి కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ తో పాటు డీఎస్పీ శ్రీనివాస్, సిఐ శ్రీధర్ రెడ్డి, తహసిల్దార్ కిషన్, ఎస్సై శ్రీశైలం, రైస్ మిల్ యాజమాన్యం సీతారాం నాయక్, అంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన కమీషనర్

**జిల్లెడు చౌదరిగూడ, మే 21,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఫ్యూచర్ సిటి కమిషనర్ తరుణ్‌జ్యోషి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. మండలంలో ఎలాంటి అవాంచనియ సంఘటనలు జరగకుండ తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రోడ్డు భద్రత, డ్రైవింగ్ నిభంధనలు తదితర అంశాలపై చర్చించారు. మండలంలో అలజడులు జరగకుండ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌కుమార్‌తో పాటు పోలీసు అధికారులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఫ్యూచర్ సిటి కమిషనర్ తరుణ్‌జ్యోషి

## ప్రమాదాల నివారణకు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి కోఠిరెడ్డి

**మేడ్చల్, మే 21, ప్రభాతవార్త :** ప్రమాదాల నివారణకు పరిశ్రమ యాజమాన్యాలు సమగ్రమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ డిసిపి కోఠిరెడ్డి తెలిపారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పరిశ్రమల యజమానులు, మేనేజర్లతో మేడ్చల్ పోలీసులు సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన డిసిపి మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని, ప్రమాదకరమైన రసాయన పరిశ్రమలలో నిబంధనల అమలు, ఫ్లేమ్‌ప్రూఫ్ ఫిట్టింగ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి పరిశ్రమ ఫైర్ ఎన్ఓసీ కలిగి ఉండాలని, మాక్ డ్రిల్స్ నిర్వహించాలని సూచించారు.మహిళల భద్రత కోసం పోష్ చట్టం అమలు చేయాలని, అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేసి, మహిళా ఉద్యోగులకు పని ప్రదేశంలో పూర్తి భద్రత కల్పించాలని తెలిపారు. పారిశ్రామిక మోసాలు, ఫిషింగ్ మరియు డేటా సెక్యూరిటీ ప్రోటోకాల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్ నిషేధమని, ఉద్యోగుల రవాణా భద్రత చేపట్టాలని,పరిశ్రమల ప్రతినిధులందరూ వంద శాతం నిబంధనలను పాటించా లన్నారు. సమస్యలు, ప్రమాదాలకు తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని ఆదేశించారు.ఆకస్మిక తనిఖీల కోసం అంతర శాఖలతో సమన్వయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎసిపి శంకర్ రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఎసిపి, టీఎస్ఐఐసీ జోనల్ కమిషనర్‌మధు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్సు ఢీకొని లారీ డ్రైవర్ మృతి

**రంగారెడ్డి అర్భన్ మే 21,ప్రభాతవార్త :** భోజనానికి వెళ్లి వస్తూ ఆర్టీసి బస్సు ఢీకొన్ని ఓ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సిఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం...కర్నూలు జిల్లా విజయనగర్ కాలనీకి చెందిన రామ్‌కుమార్ మురుగేసన్ (43) తమిళనాడులోని హోసూర్ ప్రాంతానికి చెందిన శక్తిమాన్ ట్రాన్స్ పోర్ట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీన ప్యాకింగ్ కవర్ల లోడ్ చేసిన లారీ నంబర్ కెఎ51ఎఎ0667లో హోసూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ నెల 17న శంషాబాద్ గండిగూడ గ్రామ పరిధిలోని శ్రీ తమిళనాడు లారీ ట్రాన్స్ పోర్ట్‌కు చేరుకున్నాడు.ఈ నెల 20వ తేదీ రాత్రి ట్రాన్స్ పోర్ట్ వద్ద నుంచి భోజనం కోసం వెళ్లిన రామ్‌కుమార్ తిరిగి వస్తుండగా గండిగూడ యూటర్న్ వద్ద జాతీయ రహదారి 44 దాటుతుండగా శంషాబాద్ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు నంబర్ ఏపి 39జెడ్ 0882 ఢీకొట్టింది. ప్రమాదంలో రామ్‌కుమార్ తలకు, ముఖానికి, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను రాయదుర్గానికి చెందిన వి. బాషాగా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వడ్లను కొనుగోలు చేయాలని బిజెపి వినతి

**ఘట్‌కేసర్, మే 21, ప్రభాతవార్త:** రైతు సమస్యలపై బిజెపి ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని ఘట్‌కేసర్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి అన్నారు. రైతులు పండించిన వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ గురువారం బిజెపి నాయకులు ఘట్‌కేసర్ తహశీల్దార్ బీమర్తి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్ కార్యాలయం ముందు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కొద్దిసేపు నిరసన తెలియజేసి ధాన్యం సేకరణ చేయాలని నినాదాలు చేశారు. రైతులు వడ్లను పండించి కల్లాలలో ఎండబెట్టి అమ్మకానికి ఎదురుచూస్తున్నారని అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికి ఇంకా ధాన్యం సేకరణలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. ఈసందర్భంగా తహశీల్దార్ చంద్రశేఖర్ జిల్లా కలెక్టర్‌కు తెలియజేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఘట్‌కేసర్ తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు-మాజీ ఎంపిటిసి కొమ్మిడి శోభారాణి, మాజీ ఉపసర్పంచ్ కొమ్మిడి దామోదర్‌రెడ్డి, పార్టీ ప్రధానకార్యదర్శి చెల్లక శ్రీధర్, బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, సుర్వి అనిల్‌గౌడ్, కిసాన్‌మోర్చ నాయకులు కట్ట మదుసూధన్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు దశబత్తిని చలపతిరావు, మమతశర్మ, కొత్తకాపు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## తడి, చెత్త పొడి చెత్తను వేరుచేయాలి

**సర్పంచ్ శ్రీనివాస్ నాయక్**

**కుల్కచర్ల,మే,21 ప్రభాతవార్త:** తడి, చెత్త పొడి చెత్తను వేరుచేసి ట్రాక్టర్‌లో వేయాలని సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని లాల్‌సింగ్ తాండ గ్రామ పంచాయతీలో ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించి తడి,పొడి చెత్త బుట్టలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ. .పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కోసం తడి చెత్త, పొడి చెత్తను వేరు చాలా ముఖ్యమని అన్నారు. దీనివల్ల తడిచెత్తతో ఎరువులు తయారు చేయవచ్చని,పొడి చెత్తను రీసైకిల్ చేయడానికి వీలువుతుందని పూచించారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శారద, ఉప సర్పంచ్ మాజి సర్పంచ్ లక్ష్మిబాయి, వార్డు సభ్యులు సివమ్మ,తాండ వాసులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా స్థాయి సమావేశం

**జిల్లెడు చౌదరిగూడ, మే 21,(ప్రభాతవార్త):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగ శుక్రవారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లెడు చౌదరిగూడ ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం కొంగరకలాన్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పెర్కోన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన తెలిపారు. ఉదయం 9:30గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని ఆయన పెర్కోనానరు.

## మోయామోయా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు



**రంగారెడ్డి అర్బన్ మే 21,ప్రభాతవార్త :** మోయామోయా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలువురు వైద్యులు సూచించారు. మోయామోయా వ్యాధికి సంబంధించిన శస్త్రచికిత్స విజయవంతమైన సందర్భంగా గురువారం శంషాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మలక్‌పేట్ యశోద ఆస్పత్రి వైద్యులు మాట్లాడారు...మోయామోయా వ్యాధి వల్ల మొదడుకు రక్తప్రసరణ తగ్గిపోవడంతో పునరావృత ట్రాన్సియెంట్ ఇస్కిమిక్ అటాక్స్,స్ట్రోక్,చేతులు లేదా.కళ్ల బలహీనత,మాట తడబడటం, ఫిట్స్,స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు.ఇటీవల 54ఏళ్ల మహిళ మోయోమోయా వ్యాధితో బాధపడుతూ మలాక్‌పేట్ యశోద ఆస్పత్రి వైద్యులను సంప్రదించగా సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా.జయానంద్ సుధీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక న్యూరోవాస్కులర్ వైద్య బృందం రోగికి అత్యాధునిక సెరెబ్రోవాస్కులర్ బైపాస్ శస్త్రచికిత్సలు నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.ఇలాంటి వ్యాధితో ఎవరైనా బాధపడితే వైద్యులను వెంటనే సంప్రదించాలని సూచించారు.ఈ సమావేశంలో డా.జయానంద్ సుధీర్,డైరెక్టర్ గోరుకంటీ పవన్,యూనిట్ హెడ్ కె.శ్రీనివాస్ రెడ్డి,అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర,తదితరులు పాల్గొన్నారు.

## పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మేడ్చల్ జోన్ సిఇ రమేష్

**మేడ్చల్, మే 21, ప్రభాతవార్త :** గుండ్ల పోచంపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పలుప్రాంతాలలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా గుండ్ల పోచంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో 12.5 ఎంవిఎ సామర్థం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మేడ్చల్ జోన్ సిఇ రమేష్, మేడ్చల్ సూపరెండెంట్ ఇంజనీర్ కరుణాకర్ బాబు ప్రారంభించారు. మైసమ్మగూడ, లక్ష్మీ ్మ నగర్, నైబర్హుడ్ కాలనీ, అయోధ్య క్రాస్ రోడ్ మాణిక్ రెడ్డి నగర్ అపర్ణ మొదలగు ప్రాంతాలలోలో వోల్టేజీ సమస్యలు తీరడమే కాకుండా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగినట్టుగా విద్యుత్ సరఫరా చేయగలుగుతామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ ఆపరేషన్ మేడ్చల్ శ్రీజాన్ పోతురాజు, డిఈ టిఆర్ఇ రామకృష్ణ, ఏడిఈలు రాజమల్లేష్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, రాజు. ఏఈ విజయ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎఫ్‌సినగర్‌లో పార్క్ అభివృద్ధి, నీటి సమస్యలపై వినతి

**ఘట్‌కేసర్, మే 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో హెచ్ఎండిఏ పార్కును అభివృద్ధి చేసి కాలనీలలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి గురువారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాగోల్‌లోని స్వాగత్ గ్రాండ్‌హోటల్‌లో ఎంఎంసి పరిధిలోని ఎమ్మెల్యేలు, జడ్‌సీలు, డిసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులతో కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిఅభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. అనంతరం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి వెంకట్‌రెడ్డి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్ఎఫ్‌సీనగర్‌లలో 150 ఎకరాల హెచ్ఎండిఏ లేఔట్‌లో 2 ఎకరాల విస్తీర్ణంలో బి1లో పార్క్ స్థలం ఉందని గతంలో మున్సిపాలిటీ నుంచి పార్క్ అభివృద్ధి, ఓపెన్ జిమ్ ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేసి టెండర్లను కూడా పిలిచి 2025 జనవరి 24న పనులకు శంకుస్థాపన చేశారని తర్వాత మున్సిపాలిటీ జిహెచ్ఎంసిలో విలీనం కావడంతో అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని ఆయన తెలిపారు. ఎన్ఎఫ్‌సీనగర్‌లో 10 భూగర్భ జల బోర్లు ఉండగా శిథిలావస్థకు చేరాయని మోటార్లు లేకపోవడంతో వినియోగంలో లేకుండా



ఎంఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

పోయాయని తెలిపారు. బోర్లకు మరమ్మత్తు చేసి అవసరమైన విద్యుత్ తీగలు, మోటార్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీటిని అందించి త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## శామీర్‌పేటలోని సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ నమోదు..అప్‌డేట్ కేంద్రం ప్రారంభం

**శామీర్‌పేట, మే 21, ప్రభాతవార్త:**భారత ప్రభుత్వ తపాలాశాఖా ఆధ్వర్యంలో శామీర్‌పేటలోని సబ్ పోస్టు ఆఫీస్‌లో ప్రజల సౌకర్యం ఆధార్ నమోదు, అప్‌డేట్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు మేడ్చల్ జిల్లా పోస్టల్ అధికారి సంపత్‌రెడ్డి తెలిపారు. కార్యాలయ పనిదినాల్లో ప్రతి రోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శామీర్‌పేట సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ నమోదు, అప్‌డేట్ చేయటం జరుగుతుందన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే సేవలు కొత్త ఆధార్ నమోదు, మొబైల్ నెంబర్ అప్‌డేట్, చిరునామ మార్పు, పేరు, పుట్టిన తేదీ, ఫోటో అప్‌డేట్, బయోమెట్రిక్ అప్‌డేట్ చేయటం జరుగుతుందన్నారు.



జిల్లా సబ్ పోస్టు ఆఫీసర్ సంపత్‌రెడ్డి

పేరు మార్పుకు పదవతరగతి మెమో, బర్త్ సర్టిఫికెట్, రాజపత్రం, పాస్‌ఫోర్ట్ పత్రాలు తీసుకరావల్సి ఉంటుందన్నారు.

అదే విధంగా చిరునామా ధృవీకరణకు గ్యాస్ బిల్, బ్యాంకు పాస్‌బుక్, రేషన్‌కార్డు తీసుకరావలసి ఉంటుందన్నారు. పుట్టిన తేదీ ధృవీకరణకు బర్త్ సర్టిఫికెట్, 10వ మార్కుషీట్, పాస్‌పోర్టు, పిల్లలకు..తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్లు (తల్లిదండ్రుల ఆధార్‌లో ఉన్నట్లుగా పేరు, అడ్రస్ బర్త్ సర్టిఫికెట్‌లో ఉండాలి) అన్నారు.

5సంవత్సరాల లోపు పిల్లలకు బయోమెట్రిక్ అవసరం లేదన్నారు. అన్ని అప్డేట్‌లకు రుసుం యుఐడిఎఐ నిబంధనల ప్రకారం ఉంటుందన్నారు. ఒరిజినల్ పత్రాలు తప్పనిసరిగా తీసుకరావాలన్నారు. మరిన్ని వివరాలకు శామీర్‌పేటలోని సబ్ పోస్టు ఆఫీస్‌లో సంప్రదించాలని అందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి సంపత్‌రెడ్డి కోరారు.

## రేకుల షెడ్డు పడి ఇల్లు ధ్వంసం!

**-దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి గ్రామంలో విషాదం..**

**-ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని బాధితుడి వేడుకోలు**

**దౌల్తాబాద్,మే 21,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలో మంగళవారంరోజు ఒక్కసారిగా తీవ్రమైన ఈదురు గాలులు,వడగళ్ల వానతో కూడిన భారీ వర్షం కారణంగా ఈర్లపల్లి గ్రామంలోని గురు మందిరంపై ఉన్న రేకుల షెడ్డు మొత్తం గాల్లోకి లేచి,పక్కనే ఉన్న బొమ్మన్‌గారి హన్మంతు ఇంటిపై పడింది.ఈ ఊహించని ప్రమాదంతో హన్మంతు ఇల్లు ధ్వంసమైంది.అప్పటికే అంతంత



ధ్వంసమైన ఇల్లు



బండల ఇంటిపై పడిన భారీ రేకుల షెడ్డు

మాత్రంగా ఉన్న ఆ నివాసం,భారీ రేకుల షెడ్డు వచ్చి పడటంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.ఆ సమయంలో ప్రాణనష్టం తప్పి నప్పటికీ,ఇల్లు దెబ్బతినడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది .ఉండటానికి నీడ లేక,ఎక్కడికి వెళ్లాలో తెలియక ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవు తున్నారు.తమకు ఉన్న ఒక్కగానొక్క ఆసరా కోల్పోయి అనాథలమయ్యామని , ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆర్థికంగా ఆదుకో వాలని బాధితులు హన్మంతు కుటుంబసభ్యులు వేడుకుంటు న్నారు.తమ నిస్సహాయ స్థితిని గమనించి,ప్రభుత్వం తరపున 'ఇందిరమ్మ ఇల్లు' మంజూరు చేసి తమ కుటుంబానికి నీడ కల్పించాలని వారు స్థానిక అధికారులను ,ప్రభుత్వాన్ని చేతులు జోడించి అభ్యర్థిస్తున్నారు.

## మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిల నియామకం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 21, ప్రభాతవార్త:**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిలు నియమితులయ్యారు. బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ సిఎం కెసిఆర్ తెలంగాణలోని 119అసెంబ్లీ నియోజకవర్గాలకు బిఆర్ఎస్‌పార్టీ ఇన్‌చార్జిలను నియమించారు. దీనిలో భాగంగానే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు బిఆర్ఎస్ పార్టీల ఇన్‌చార్జిలు నియమితులయ్యారు. జిల్లాలోని మేడ్చల్ నియోజకవర్గంకు రాగిడి లక్ష్మారెడ్డి, మల్కాజ్‌గిరికి నందికంటి శ్రీధర్, కుత్బుల్లాపూర్‌కు ఎమ్మెల్సీ కె.నవీన్‌రావు, కూకట్‌పల్లికి గజ్జెల నాగేశ్, ఉప్పల్‌కు గొంగిడి మహేందర్‌రెడ్డిలు బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిలుగా నియమితులయ్యారు. ఇక బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, డిజిటల్ ప్రక్రియ, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయటానికి బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిలను నియమించినట్లు స్పష్టం అవుతుంది.